



జెడిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతుసంఘం నాయకులు

లక్షల్లో పంటలు నష్టపోతే..

వందల్లో పరిహారం ఇస్తారా..?

◆ 2022 ఖరీఫ్ పంటల బీమా పూర్తి స్థాయిలో ఇవ్వాలి
◆ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో జెడిఎ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'2022లో పంటలు సాగు చేసి అతివృష్టి, అనావృష్టి కారణంగా ఒక్కో రైతు లక్షలది రూపాయలను పెట్టుబడులు రూపంలో నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వారిని పూర్తి స్థాయిలో ఆదుకోవాలి. అలా కాకుండా లక్షల్లో పంటలు నష్టపోతే వందల్లో పంట నష్టపరిహారం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసింది. ఇలాంటి కంటితుడుపు చర్యలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు.' అంటూ రైతు సంఘం సంఘం నాయకులు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. అనంతపురం జిల్లాలోని రైతులకు ప్రభుత్వం ప్రకటించిన 2022 ఖరీఫ్ పంటల బీమా అందరికీ ఆయా పంటల నష్టాన్ని బట్టి పూర్తి స్థాయిలో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక పెన్నార్ భవనం నుంచి రైతులు, రైతుసంఘం నాయకులు ర్యాలీగా జెడిఎ కార్యాలయానికి చేరుకుని, అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు సాగుచేసిన అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దాదాపు రూ.3వేల కోట్లను పెట్టుబడుల రూపంలో రైతులు కోల్పోయారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2022 ఖరీఫ్ పంటల బీమా వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.700 నుంచి రూ.1500 లోపు ఇవ్వడం అంటే రైతులను మోసం చేయడమే అన్నారు. కంది, పత్తి తదితర ఇతర పంటలకు కూడా నామమాత్రంగానే బీమా ఇచ్చారన్నారు. పండ్ల తోటలకు సంబంధించి దానిమ్మ, పత్తి, అరటి, మిరప, టమోటా తదితర పంటలకు బీమా ఇవ్వలేదన్నారు. రైతులు లక్షల్లో పంటలను నష్టపోతే ప్రభుత్వం వందల్లో పరిహారం ఇవ్వడం అన్యాయం అన్నారు. గడిచిన నాలుగేళ్లలో పంటలు చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు 242 మంది ఆత్మహత్యలు చేసుకుని మరణించారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకునే చర్యలను చేపట్టకుండా ఇలాంటి కంటితుడుపు బీమాలను విడుదల చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఖరీఫ్ బీమాను సవరించి రైతులకు ఆయా పంటల సాగునుబట్టి ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీన ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు నిమిత్తం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారని, ఆ లోపుగా పంట నష్టపరిహారాన్ని సవరించి వేరుశనగ, పత్తికి ఎకరాకు రూ.30 వేలు, కందికి రూ.20 వేలు, దానిమ్మ, మిరప, అరటి పండ్లతోటలకు ఎకరాకు రూ.50 వేలు బీమా ప్రకటించి అమలు చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, రైతుసంఘం నాయకులు బి.చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఏపి రైతుసంఘం రాష్ట్ర నాయకులు రాజారామిరెడ్డి, చెన్నారెడ్డి, జిల్లా నాయకులు పోతలయ్య, శ్రీనివాసులు, రాముడు, చంద్రశేఖర్, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఎకానమీగా సత్యసాయి జిల్లా

◆ ఆ దిశగా అందరూ కలిసి రావాలి
◆ ప్రధాని నరేంద్ర మోడీ
◆ వర్చువల్ ద్వారా సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం
◆ పుట్టపర్తి నుంచి పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్



పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుంచి సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోడీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి జిల్లా మొత్తాన్ని డిజిటల్ ఎకానమీ దిశగా మార్చాలని, ఆ దిశగా దీనిని నెరవేర్చేందుకు అందరూ కలిసి వస్తే వచ్చే శ్రీ సత్యసాయిబాబా జయంతి నాటికి జిల్లా మొత్తాన్ని డిజిటల్‌గా మారుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ తెలియజేశారు. న్యూఢిల్లీ నుంచి మంగళవారం నాడు వర్చువల్ విధానం ద్వారా ప్రధాని పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను బటన్ నొక్కి ప్రారంభించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈయనతో పాటు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, శ్రీసత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ ఛాన్సలర్ కె.చక్రవర్తి, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు ర్యాకాశ్ హీరా, ఎస్.ఎస్.నాగానంద్ వి.మోహన్, శ్రీసత్య సాయి సేవ ఆర్గనైజేషన్స్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ నిమిష్ పాండ్యాలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోడీ ప్రసంగించారు. ఏ ఆలోచన అయినా మానవతా విలువలతో కూడిన కార్యాచరణ సాగించినప్పుడు అత్యంత ప్రభావితంగా ఉంటుందన్నారు. సత్యసాయిబాబా మానవాళికి ఎన్నో సేవా కార్యక్రమాలు అందించారని, ఆయన చూపిన మార్గం ఎంతో మందికి స్ఫూర్తి_దాయకం అని కొనియాడారు. పుట్టపర్తిలో సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం మరో అద్భుతం అన్నారు.

సాంకేతిక, ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా భారత్

ప్రస్తుతం భారతదేశం కూడా తన విధులకు ప్రాధాన్యతనిస్తూ మెరుగైన అభివృద్ధి దిశగా కదులుతోందని ప్రధాని తెలిపారు. స్వాతంత్ర్య శతాబ్ది దిశగా పయనిస్తూ అమత్‌కాల్‌కి 'కర్తవ్య కాల' అని పేరు పెట్టాం అన్నారు. ఈ ప్రతిజ్ఞల్లో ఆధ్యాత్మిక విలువల మార్గదర్శకత్వం, భవిష్యత్తు కోసం తీర్మానాలు ఉంటాయన్నారు. భారతదేశం సాంస్కృతిక, ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా ఉందన్నారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మద్దతునిచ్చే ప్రపంచంలోని టాప్ 5 ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఇప్పుడు ఒకటిగా మారిందని చెప్పారు. డిజిటల్ టెక్నాలజీ, 5జీ వంటి రంగాల్లో ప్రపంచంలోని అగ్రగామి దేశాలతో భారత్ పోటీ పడుతోందని పేర్కొన్నారు.

సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించిన గవర్నర్

పుట్టపర్తికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉదయం ప్రశాంతి నిలయంలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. అంతకుముందు ప్రశాంతి నిలయంలో ఉన్న శాంతిభవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ని కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టిపిస్.చేతన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నంది విగ్రహాన్ని అందజేశారు. ప్రశాంతి నిలయంలో గౌరవ మర్యాదపూర్వకంగా పోలీసుల వందనంను గవర్నర్ స్వీకరించారు అనంతరం రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

విలేకరులకు నో ఎంట్రీ

సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక మీడియాకు అనుమతి నిరాకరించారు. కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరులు ఎవరినీ లోపలికి పంపలేదు. దీంతో విలేకరులందరూ బయటనే వేచి ఉండాల్సి వచ్చింది. పాత్రికేయులను అనుమతించకుండా సత్యసాయి ట్రస్టు తీసుకున్న నిర్ణయంపై పలువురు పాత్రికేయులు అసహనం వ్యక్తం చేశారు.

ఉద్యమవీరుడు అల్లూరి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్,

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ వారిని ఎదిరించిన ఉద్యమవీరుడు అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. మంగళవారం నాడు కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలను నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ గాయత్రి దేవి, హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అన్నా దొర, గిరిజన సంఘాల నాయకులు అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. తెలుగుజాతి చరిత్రలో అల్లూరి సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం అపూర్వ ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

సిఎం పర్యటనను అడ్డుకుంటాం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఏటిఎం.నాగరాజు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా తదితరులు హాజరై మాట్లాడుతూ కరోనా కాలంలో నియమించిన కార్మికులను యధావిధిగా కొనసాగించాలన్నారు. ఎన్నికల్లో హామి ఇచ్చిన విధంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులను దశలవారీగా క్రమబద్ధీకరణ చేస్తామని హామి ఇచ్చారన్నారు. అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల మంది పైగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని, కేవలం 6600 మంది పైగా రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సమాన పనికి – సమాన వేతనం, సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డు, రిస్క్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. 60 సంవత్సరాలు నిండి తొలగించిన, మృతిచెందిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, డెత్ బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. కోవిడ్ సమయంలోనూ, పెరిగిన జనాభా అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులను పన్నుల్లోకి తీసుకుని తొలగించిన కార్మికులందరిని కొనసాగించి రెగ్యులర్ చేయాలన్నారు. రాయదుర్గంలో కోవిడ్, వరదల సమయంలో తీసుకున్న కార్మికులందరినీ యధావిధిగా కొనసాగించాలన్నారు. అనంతపురం నగరంలో కోవిడ్ మలేరియా గార్బేజ్ కార్మికులను అప్కాసులో చేర్చాలన్నారు. పట్టణాలలో పెరిగిన జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కళ్యాణదుర్గంలో పర్యటించనున్నారని, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



దీపికా

ఇక్బాల్ అవుట్ .?

హిందూపురం సమన్వయకర్తగా దీపికా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం వైసిపి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను ఆ పదవి నుంచి తప్పించారు. ఆ స్థానంలో దీపికారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఆ పార్టీ ప్రకటన జారీ చేసింది. 2019 ఎన్నికల సమయంలో మహమ్మద్ ఇక్బాల్‌కు హిందూపురం ఎమ్మెల్యే టిక్కెట్టు ఇచ్చారు. టిడిపి కంచుకోట అయిన హిందూపురంలో ఆయన విజయం సాధ్యపడలేదు. అప్పటి నుంచి ఆయనే ఇన్‌ఛార్జిగా ఉంటూ వచ్చారు. ఈ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఇక్బాల్‌కు వెంటనే ఎమ్మెల్సీ పదవినిచ్చారు. అప్పటి నుంచి ఆయన ఇక్కడే ఉంటూ వచ్చారు. అయితే ఇక్బాల్‌కు స్థానిక నాయకులు కొంత మందికి పడటం లేదు. విభేదాలు బాహాటంగానే పలుమార్లు జరిగాయి. ఈ క్రమంలోనే రామకృష్ణారెడ్డి హత్య జరగడం నేరుగా ఇక్బాల్‌పైనే పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి. ఆయన ఈ ఆరోపణలను ఖండించారు. స్థానిక నాయకులు కొంత మంది అధిష్టానానికి, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగానున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను తప్పిస్తున్నారన్న ప్రచారం చాలాకాలంగా సాగుతూ వచ్చింది. ఇటీవల తిరుపతిలో జరిగిన సమావేశానికి ఇక్బాల్‌కు ఆహ్వానించకుండా దీపికారెడ్డిని ఆహ్వానించారు. అప్పుడే కొత్త పేరు తెరపైకి ఇచ్చింది. దీపికారెడ్డి పేరు అనుహ్యంగా రావడం తిరుపతి సమావేశానికి పిలిపించడంతో చర్చనీయాంశం అయ్యింది. ఈమె పేరు అనూహ్యంగా తెరపైకి రావడంతోపాటు, ఇప్పుడు హిందూపురం పార్టీ సమన్వయకర్తగానూ నియమించడంతో ఆమె ఎవరు.? ఏ రకంగా తెరపైకి వచ్చిందన్న చర్చ సాగుతోంది. భర్త రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ ఆమె మాత్రం బిసి సామాజిక తరగతికి చెందినది. భర్త వ్యాపారవేత్త కాగా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ఆమె తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఈమెకు స్థానికంగా ఏ మేరకు మద్దతు లభిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే దీపికారెడ్డి కూడా ముందు నుంచి పార్టీలో చురుగ్గా పాల్గొన్న దాఖలాల్లేవు. బయటకు నుంచి ఉన్నఫలంగా రాజకీయ అరంగేట్రం చేయడంతో స్థానిక నాయకులను ఈమె ఏ మేరకు సమన్వయం చేసుకోగలరన్నది ప్రశ్నార్ధకంగానే ఉంది. వైసిపిలో హిందూపురం నియోజకవర్గంలో ముందు నుంచి గ్రూపు తగాదాలున్నాయి. రెండు, మూడు గ్రూపులుగా రాజకీయాలు ఇక్కడ నడుస్తున్నాయి. ఈ గ్రూపులను కొత్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన దీపికారెడ్డికి సహకారం ఏ రకంగా అందుతున్నది సందేహస్పాదంగనానే ఉందని చెప్పవచ్చు. అది కూడా మైనార్టీలు అధికంగానున్న ఈ నియోజకవర్గంలో మైనార్టీ నాయకుడుగానున్న మహమద్ ఇక్బాల్‌ను కాదని దీపికారెడ్డిని తీసుకొచ్చారు. మార్పు జరుగుతుందని తెలిసినప్పటి నుంచే మహమ్మద్ ఇక్బాల్‌కు టిక్కెటు వచ్చే ఎన్నికల్లో ఖరారు చేయాలని మైనార్టీ నాయకులు హిందూపురం పట్టణంలో ప్రదర్శనలు నిర్వహించి, మద్దతు తెలిపారు. ఈ సమయంలో ఆయన కాదని కొత్త వారికిస్తే వారి మద్దతు ఏ మేరకు దీపికారెడ్డికి ఉంటుందన్న చర్చ పార్టీ వర్గాల్లోనూ నడుస్తోంది. అది కూడా తెలుగుదేశం పార్టీకి కంచుకోటలాగానన్న హిందూపురంలో ఈ మార్పు వైసిపికి ఏ మేరకు దోహదపడగలలదన్నదీ ప్రశ్నార్ధకమే. పార్టీలోని గ్రూపు తగాదాలకు పుల్‌స్టాప్ పెట్టే చర్యలు కాకుండా నాయకత్వాన్ని మార్చినంత మాత్రానా ఆ పార్టీకి ప్రయోజనం చేకూరుతుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.



ఎమ్మెల్సీ ఇక్బాల్

గుత్తిలో వివాదాస్పదంగా మరుగుదొడ్ల నిర్మాణం

దుకాణాల వద్ద నిర్మాణంతో వ్యాపారుల్లో వ్యతిరేకత

అడ్డుకున్న ఆర్టీసీ అధికారులు



వివాదాస్పద స్థలం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా మురుగు కాలువ మీద మున్సిపల్ అధికారులు నిర్మించబోతున్న ఆధునిక మరుగుదొడ్ల సముదాయం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. స్వచ్ఛ సుగం పారిశుధ్యం సూచనలో భాగంగా స్థానిక పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన బస్టాండ్ ఎదురుగా మురుగు కాలువ వెనుక వైపున బోట్ ఆధారంగా ప్రజల సౌకర్యార్థం ఆధునిక మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నిర్మాణం కోసం కొలతలు వేస్తుండగా ఆర్టీసీ అధికారులు అడ్డుకున్నారు. ఆ స్థలం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు సంబంధించినదని ఇక్కడ నిర్మాణం చేపట్టేందుకు వీలులేదని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం బస్టాండ్ లో రెండు ప్రాంతాల్లో మరుగుదొడ్ల సముదాయం ఉందన్నారు. మరోవైపు ఆర్టీసీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్న యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రూ.లక్షలు అడ్వాన్స్‌గా ఆర్టీసీ సంస్థకు చెల్లించి, వేల రూపాయలు అద్దెల రూపంలో చెల్లిస్తున్నామని చెప్పారు. హోటళ్లు, తినుబండారాలతో పాటు వివిధ దుకాణాల మధ్య మరుగుదొడ్ల సముదాయం నిర్మిస్తే తమ వ్యాపారాలు ఎలా సాగుతాయని వాపోతున్నారు. తాము రోడ్డున పడతామని వాపోయారు. ఆ స్థలం తమ సంస్థకు సంబంధించినదని అక్కడ మరుగుదొడ్ల సముదాయం నిర్మించరాదని మున్సిపల్ అధికారులకు లేఖ రాశామని ఏపీఎస్ ఆర్టీసీ గుత్తి డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ నారాయణస్వామి తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు వివరణ కోరగా గతంలో ప్రతిపాదనలు పంపగా అక్కడ ఆధునిక మరుగుదొడ్ల సముదాయం నిర్మాణానికి మంజూరైందన్నారు. ఆర్టీసీ అధికారులు, దుకాణాదారులకు ఇబ్బంది కలిగించమన్నారు. అక్కడ సర్వే చేపిస్తామని ఆ స్థలం ఏపీఎస్ఆర్టీసీ సంబంధించింది అయితే ఆధునిక మరుగుదొడ్ల సముదాయం నిర్మించమని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో నిర్మాణంకు పరిశీలిస్తామన్నారు.



నివాళి అర్పిస్తున్న ఐద్వా నాయకులు

మాణికొండ సూర్యావతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర్య పోరాట యోధురాలు మాణికొండ సూర్యావతి వర్ధంతిని పురస్కరించుకుని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని శ్రీశ్రీ కాలనీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు హసీనా, చంద్రిక మాట్లాడుతూ వందేళ్ల క్రితం కృష్ణా జిల్లా ఇందుపల్లి గ్రామంలో జన్మించిన సూర్యావతి జాతీయోద్యమ కాలంలో ఉద్యమాలు, పోరాటాలతో మహిళల్లో నూతనోత్తేజాన్ని నింపారని గుర్తు చేశారు. బ్రిటీష్ ప్రభుత్వం పోవాలనీ, దేశానికి స్వాతంత్ర్యం కావాలనీ సాగుతున్న ఉద్యమంలో మహిళల్ని సమీకరించే కృషిలో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు గీత, సువర్ణ, సునీత, ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సిఐ ఆనందరావుకు నివాళి

ప్రజాశక్తి-యాడికి

తాడిపత్రి టౌన్ సిఐ ఆనందరావు మృతికి సంతాపంగా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జె.సి.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెసి నివాసం నుంచి మహాత్మగాంధీ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆనందరావు చిత్రపటం ఉంచి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరి రంగయ్య, నాగమునిరెడ్డి, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, తాంద్ర విక్రమ్, డదియాల ఆది, కులశేఖర్, రామచంద్రారెడ్డి, నీలకంఠారెడ్డి, లక్ష్మణ్, పుప్పాల దేవేంద్ర, మెకానిక్ బాబు, రామునాయక్, జయానాయక్, హరి, భాస్కర్, గంగరాజు, రాజా, రఘు, బాలు, హరి, తదితరులు పాల్గొన్నారు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎస్ఎస్ఎస్ యూనిట్–1 ఆఫీసర్ నగరూరు రసూల్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. విద్యార్థులందరూ చైతన్యవంతులై డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సాంబ, అశోక్, ప్రత్యూష, నిషా, భవ్య, జ్ఞానేష్, బాలు, నారాయణస్వామి, మోహన్, అభి, సుచిత్ర, ప్రీతి, నిఖిత, జ్ఞానాంబిక, నరేంద్ర, శివ, సుష్మ, మైత్రి, తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా కోసం రోడ్డెక్కిన రైతన్నలు

ప్రజాశక్తి-ఉరవకొండ



రాస్తారోకో చేస్తున్న టిడిపి నాయకులు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పంటల బీమా పంపిణీలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ టిడిపి ఆధ్వర్యంలో రైతులకు రోడ్డెక్కారు. ముందుగా మంగళవారం మండల పరిధిలోని చిన్నముష్టూర్, నింబగల్ గ్రామాల సచివాలయాల వద్ద రైతులు ధర్నా చేపట్టారు. అధికారుల స్పందించకపోవడంతో అనంతపురం–బళ్లారి 42వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు, టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పంటల బీమా కేవలం పత్తి, చీనీ పంటలకు మాత్రమే ఇవ్వడంతో ఇతర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న సిఎం జగన్ ఆచరణలో చేసింది శూన్యమన్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు సరైన దిగుబడి రాక, ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు గుర్తించి అన్ని రకాల పంటలకు పంటల బీమా వర్తించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హరినాథ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. అనంతరం రైతులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటేసులు, ఓబులేసు, టిడిపి మండల ఉపాధ్యక్షులు రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాంబాబు, నాయకులు నెట్టెం బోస్, తిమ్మారెడ్డి, నెలపాటి రాంబాబు, సిద్ధప్ప, అశోక్, దాము, ఓబులేసు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

గుత్తి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మంగళవారం ఆర్థికసాయం చేశారు. మండలంలోని గొందిపల్లి గ్రామానికి చెందిన నంద్యాల వంశీకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వైద్యులు అతడి కాళ్లకు సర్జరీ చేశారు. దీంతో ఎమ్మెల్యే అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం గొందిపల్లి, గాజులపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కోనా మురళీధర్‌రెడ్డి, కె.మధుసూదన్ రెడ్డి, నాయకులు వై.సుభాష్‌రెడ్డి, గురు ప్రసాద్, ప్రవీణ్ కుమార్, ఎస్. రాము యాదవ్, లక్ష్మీకాంతరెడ్డి, లలూనాయక్, కౌన్సిలర్లు ఫారుక్, మాజీ ఎంపిటిసి రాజన్న, హనుమంతు, వాల్మీకి శివ, వరద, రమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఉపాధ్యాయుడు ఆత్మహత్య


అమరేంద్ర (పాతచిత్రం)

అనంతపురం : అనంతపురం నగరంలోని పిటిసి సమీపంలో రైలు కిందపడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు వారి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన అమరేంద్ర అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు పామిడి పట్టణంలోని ఉర్దూ ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఇటీవలే బదిలీపై ఆ పాఠశాలలో చేరాడు. వ్యసనాలకు బానిసై గత కొద్ది కాలంగా తీవ్ర మనస్థాపనతో తన స్నేహితులు తోటి ఉపాధ్యాయులతో కూడా కలవకుండా పాఠశాలకు వెళ్లకుండా గడుపుతుండేవాడని వారి సమీప బంధువులు వెల్లడించారు. గత కొద్ది కాలంగా తీవ్ర ఆవేదనతో ఉన్న అతను మనస్థాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడని అయితే గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మతి చెందినట్లు స్థానికులు వారి కుటుంబ సభ్యులకు వెల్లడించగా వారు ఉపాధ్యాయుడు అమరేంద్ర గా గుర్తించారు. దీంతో మతదేహాన్ని అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.దచీశీఅవగ

కడుపునొప్పి తాళలేక విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరయ్య

అనంతపురం కలెక్టరేట్ : కడుపునొప్పి తాళలేక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జెఎన్‌టియూ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈశ్వరయ్య (18) తండ్రి సాంబశివుడు, ముప్పాలగుత్తి గ్రామం, పెద్దవడగూరు మండల వాసి. జెఎన్‌టియులో పాలిటెక్నిక్ డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అయితే గత కొన్ని నెలలుగా విద్యార్థి ఈశ్వరయ్య కడుపు నొప్పితో బాధ పడతున్నాడు. ఇంతకు మునుపే కడుపునొప్పితో బాధపడుతుంటే తల్లి తండ్రులు ఈశ్వరయ్యకు వైద్యం చేయించారు. ఈశ్వరయ్య స్నేహితుల రూంకు వెళ్లాడు. సోమవారం కడుపునొప్పి తీవ్రమైంది. స్నేహితులంతా బయటకు వెళ్లిన సమయంలో ఈశ్వరయ్య సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూమ్ వచ్చిన స్నేహితులు ఫ్యాన్‌కు వేలాడుతున్న ఈశ్వరయ్య కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. జరిగిన సంఘటపై పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. విద్యార్థి తల్లి తండ్రులతో మాట్లాడారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికులపై సిఎం స్పందించాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

కరోనా మొదటి, రెండవ దశల్లో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించిన కార్మికుల తొలగింపుపై ముఖ్యమంత్రి జగన్ స్పందించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 2వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో కూడా రాష్ట్ర ప్రజలకు సేవలు అందించిన కార్మికులను యథావిధిగా ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మున్సిపాలిటీల్లో కరోనా కార్మికులను కొనసాగిస్తున్నప్పటికీ రాజకీయం మున్సిపాలిటీలో మాత్రం తొలగించడం బాధాకరమన్నారు. పట్టణంలో కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. కావున తక్షణమై కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను తక్షణమే ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఈనెల 8న కళ్యాణదుర్గానికి వస్తున్న సిఎం జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జయపుత్ర, తిప్పేస్వామి, రాజు, చిన్న, నిర్మల, ధర్మేంద్ర, సీనా, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్కే యూనివర్సిటీ పరిధిలో పెంచిన డిగ్రీ సెమిస్టర్ ఫీజులు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్కేయూ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థిని విద్యార్థులకు రూ.550 నుంచి ఉన్న ఫిజులను ఏకంగా రూ.1050, రూ.1900 చొప్పున పెంచడం విద్యార్థులకు విద్యాభ్యాసాకిని అడ్డుగా ఏర్పడిందన్నారు. మూడింతలు ఫీజులు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. యూనివర్సిటీ అధికారులు మాత్రం విద్యార్థులు ఎగ్జామ్ పాస్ అయిన తర్వాత టీసీ, మార్క్స్ కార్డ్, మైగ్రేషన్ సర్టిఫికెట్ ముందే కట్టించుకుంటున్నామని చెబుతున్నారని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు దాదాపు పాస్ అయినా వాళ్ళ కంటే ఫెయిల్ అయ్యేవాళ్ళు అత్యధికంగా ఉన్నారని తెలిపారు. మార్క్స్ కార్డ్, మైగ్రేషన్, టిసి పేర్లతో డబ్బులు కట్టించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఎగ్జామ్స్ సమయం మించిపోతే రూ. 5 వేలు నుంచి రూ.10 వేల వరకు జరిమాణీ ఫీజు పేరుతో డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధిక ఫీజులు వసూలు పర్వాన్ని ఆపాలన్నారు. పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో ఎస్కేయూ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, వర్ధన్ బాబు, ఆదర్శ్, సూర్య, ప్రకాష్, సమీర్, చందు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయదుర్గం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల్లో పెంచిన పరీక్ష ఫీజులు, సెమిస్టర్ ఫీజులను వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ తాలూకా కార్యదర్శి కొత్రేష్ డిమాండ్ చేశారు. మంగళవానం పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న రూ.550 పరీక్ష ఫీజును ఏకంగా రెండింతలు రూ.1,050 నుంచి 1900 వరకూ పెంచడం బాధాకమరన్నారు. వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, యువజన సంఘాల నాయకులు శివ, రాజు, వంశీ, హర్ష, భాస్కర్, కిషోర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ప్రతిపక్షమే లేదు..

మళ్లీ మాదే అధికారం : ఎమ్మెల్యే జొన్నలగడ్డ

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల నియోజవర్గంలో ప్రతిపక్షమే లేదని, వచ్చే ఎన్నికల్లో కూడా తామే గెలిసి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణస్వీకారం చేస్తారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దమట్లగొంది గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ప్రతిపక్షం లేదన్నారు. తమపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు ఎప్పుడూ ఈ గ్రామాన్ని సందర్శించిన పాపానపోలేదన్నారు. అదే జగనన్న ప్రభుత్వంలో ప్రతి గ్రామానికీ నాయకులు, అధికారులు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. గత ఎమ్మెల్యేలు కేవలం కొన్ని గ్రామాలకు వచ్చి ప్రచారానికి మాత్రం పరిమితం అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు కోరే రాముడు, భాస్కర్‌రెడ్డి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

వంగవీటి రంగాకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేద బడుగు బలహీన వర్గాల ఆరాధ్యుడు వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకుని మంగళవారం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భవానీ రవికుమార్, గల్లా హర్ష సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాటరింగ్ రవికాంత్ రమణ, అడ్వకేట్ అదెన్న, పగడాల మల్లికార్జున, పేరూరు శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, లలిత్ కుమార్, భవాని రవికుమార్, జయరాం రెడ్డి, రాయల్‌మురళి, మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్, పత్తి చంద్రశేఖర్, పుట్లూరు నారాయణస్వామి, మున్నానగర్ రమేష్, ఆకుల రాఘవేంద్ర, గల్లా హర్ష, పవన్ కుమార్, సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.


శింగనమల : వంగవీటి రంగా జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని రామస్వామి ఆలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరాయునిపేట డీలర్ నాగార్జున, శంకర్‌నారాయణ, జడేజా, నాగభూషణ, మట్లగొంది నాగేంద్ర, రఘురాం, కూరగాయల సత్యనారాయణ, పేట మురళీకృష్ణ, డీలర్ నాగరాజు, గురుస్వామి, దాసరి నారాయణస్వామి, నరసాపురం జంగంశెట్టి నవీన్‌కుమార్, మాసూలు బాలగంగాధర్, మాసూలు ప్రకాష్, గుమ్మేపల్లి రమేష్, టైలర్ రమేష్ బ్రదర్స్, చిన్నాజలాలపురం తిరుమల, తదితరులు పాల్గొన్నారు.


వంగవీటి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాపు నాయకులు

టవర్‌క్లాక్ వద్ద తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయం టవర్ క్లాక్ సమీపంలో ప్రభుత్వ స్థలంలోనే ఏర్పాటు చేయాలని సిపిఎం రూరల్ మండల కమిటి కార్యదర్శి టి.రామాంజినేయులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సిపిఎం నేతలు సేకరించిన సంతాకాల పత్రాలను ఎమ్మెల్యే తోపుదుర్తికి అందజేశారు. అన్ని గ్రామాలకు అనుకూలంగా ఉండేందుకు పాత తహశీల్దార్ కార్యాలయం ఉన్న స్థలంలోనే రూరల్ తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులు పరిశీలిస్తున్నారని, ప్రజలందరికి ఎక్కడ బాగుంటుందంటే అక్కడే ఏర్పాటు చేస్తారని తెలిపారు.


ఎమ్మెల్యే తోపుదుర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి చెందిన చిన్నవీరయ్య, భార్య దస్తగిరమ్మ(57)తో కలిసి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా టైరు పగిలి పోవటంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయపడ్డ ఇద్దరినీ చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దస్తగిరమ్మ మరణించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిరుత దాడిలో గొర్రెలు మృతి


చిరుత దాడిలో మృతిచెందిన గొర్రెలు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం గ్రామంలో పాపన్నకు చెందిన గొర్రెల మందపై బుధవారం తెల్లవారుజామున ఓ చిరుత దాడి చేసింది. ఈ ఘటనలో 4 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి చినుకులు పడటంతో కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రించారు. ఈ సమయంలో ఆరు బయట ఉన్న గొర్రెల మందపై చిరుత దాడి చేసి చంపినట్లు వాపోయారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. ఇటీవల కాలం లో తరచూ చిరుత బారిన పడి గొర్రెలు, మేకలు మృతి చెందడంతో పెంపకందారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత బారి నుండి నష్టపోకుండా రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు

అనంతపురం క్రైం : అనంతపురంలో టీవీ టవర్ వద్ద ఒక మహిళను హత్య చేసి పక్కనే ఉన్న ఇంట్లో దొంగతనం చేసిన చేసిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీలు ప్రసాదరెడ్డి, శివారెడ్డిమాట్లాడుతూ 2020లో స్థానిక టీవీ టవర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద నిద్రిస్తున్న కుమ్మర లక్ష్మీదేవిని హత్య చేసి పక్కనే ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. ఈ కేసులో గుంతకల్లుకు చెందిన శికారి సర్దార్ ఎ.రాజు, ఎ.బొంబాయి వాలా, స్థానిక బుడ్డప్పనగర్ కి చెందిన శికారి బూజులు, గుంతకల్లుకు చెందిన శికారి మద్దిలేటి ఎ.మదన్‌ను అరెస్టు చేసి 33 గ్రాముల బంగారు ఆభరణాలు, హత్యకు ఉపయోగించిన ఆయుధం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు

కళ్యాణదుర్గం : గతనెల 14న హత్యకు గురైన మండల పరిధిలోని కదరంపల్లి గ్రామానికి చెందిన కురుబ గోవిందప్ప హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో కురుబ గోవిందప్ప, కురుబ రాము మధ్య ఆస్తి పంపకాలు జరిగాయి. అప్పటి నుంచి కోపంతో ఉన్న రాము గతనెల 14న గోవిందప్ప తోటలో ఉండతన అనుచరుడు ఫకృద్దీన్ కలిసి హత్య చేసినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో గోవిందప్ప కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక రూరల్ సీఐ కే.శ్రీనివాసులు, పట్టణ సీఐ తేజమూర్తి తమ ప్రత్యేక బృందాలతో దర్యాప్తులో రాము, ఫకృద్దీన్ హత్య చేసినట్లు తేలిందన్నారు. పట్టణంలోని హిందూపురం రోడ్డులో నిందితులను సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా హత్యచేసినట్లు ఒప్పుకున్నారన్నారు. ఈమేరకు పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

శింగనమల మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా బి.సునీత



పుట్లూరు : శింగనమల మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా పుట్లూరుకు చెందిన భూమిరెడ్డి గారి సునీతను నియమించారు. సునీత వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నందుకు ఎంపి తలారి రంగయ్య, సిఎం జగన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కలెక్టరేట్ : న్యాయవాదులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని బార్ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ నాయకులు ఐ.రవీంద్రనాథ్‌రెడ్డి, జె.రాజారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ రసూల్, వేణుగోపాల్ తదితరులు హాజరై మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకై కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు చట్టం చేసి అమలు చేయాలన్నారు.ఏపీ బార్ కౌన్సిల్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.75 కోట్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్‌కు గవర్నమెంట్ ఇవ్వాల్సిన మ్యాంచింగ్ గ్రాంట్స్ రూ.30 కోట్లు విడుదల చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు ఇస్తున్న లా నేస్తం ప్రతి నెలా ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్‌సిసి క్యాంప్ ప్రారంభం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాకు చెందిన 510 క్యాడెట్స్‌కు ఈ నెల 3వ తేది నుంచి 12వ తేది వరకు నిర్వహిస్తున్న మిలటరీ శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభించినట్లు ఎన్‌సిసి క్యాంప్ కమాండెడ్ వైవి.కేసిరెడ్డి తెలిపారు. మంగళవారం అనంతపురం ఎన్‌సిసి నగర్‌లో నిర్వహించిన ఎన్‌సిసి క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ వన్ ఆంధ్ర మెడికల్ ఆధ్వర్యంలో కర్నూల్, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన 510 క్యాడెట్స్‌కు మిలిటరీ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శారీరక శిక్షణతో పాటు ఆరోగ్యం, ట్రాఫిక్, 108, అగ్నిమాపక సంబంధిత అంశాలపై అవగాహన పెంపొందిస్తున్నట్లు తెలిపారు. వారి ప్రవర్తనలో మార్పు ద్వారా ఇతర విద్యార్థులకు ఎన్‌సిసి పై ఆసక్తి కలిగించి తద్వారా దేశ సమగ్రతలో దేశ సేవలో యువత ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు సుధీర్, విజయకుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, ప్రతాప్, శవిధర్, పరిమళ, రాధ, 1 ఆంధ్ర, 28 ఆంధ్ర, 6 ఆంధ్ర, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ 'జగనన్న రక్ష'

విప్ కాపు రామచంద్రారెడ్డి



లబ్ధిదారురాలికి సర్టిఫికెట్ అందజేస్తున్న విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రతి కుటుంబానికీ ముఖ్యమంత్రి జగనన్న రక్షగా ఉంటారని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచి గంగమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, వైసిపి నాయకులు కదరంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మల్లాపురం గ్రామంలో సర్పంచి వెంకటమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌రాజ్, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ప్రతి కుటుంబానికీ ముఖ్యమంత్రి జగనన్న రక్షగా ఉంటారని ఎంపిపి దాసరి సునీత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొట్టాలపల్లి సచివాలయం ప్రాంగణంలో తహశీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పార్వతి, ఎంపిటిసి సుజాత, సిఐ నాగార్జునరెడ్డి, గ్రామీణ అభివృద్ధి విస్తరణ అధికారిణి దామోదరమ్మ, డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి, విఆర్‌ఒలు చక్రధర్, గణేష్, కార్యదర్శులు సాదిక్‌వలి, రామమోహన్, లోకేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న సురక్ష ఒక బృహత్తర కార్యక్రమం అని ప్రత్యేకాధికారిణి ఓబులమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని కడవకల్లు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల జీవితాలు, సమాజాన్ని మార్చేందుకు సిఎం జగన్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, మండల విద్యాధికారిణి శ్రీదేవి, సర్పంచి రామాంజనేయులు, వాలంటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్ప : జగనన్న సురక్షతో సమస్యలను పరిష్కరించేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నట్లు ఎంపిపి పెద్దన్న, జడ్పిటిసి కె.మమత తెలిపారు. మంగళవారం మండలంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం, రామసాగరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇళ్ల వద్దకే వాలంటీర్లు, ప్రజలు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శంకరయ్య, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ పీరాసాబ్ సర్పంచులు సాలిబాయి, రామ లక్ష్మమ్మ, వైసిపి నాయకులు త్రిలోకనాథ్‌రెడ్డి, రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు శివలింగప్ప, కన్వీనర్ శ్రీనివాసులు, గోవింద్‌రెడ్డి, కరుణాకర్, నరిగన్న, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, వీఆర్వో ఎర్రిస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు : తాము ఎప్పుడు ప్రజలకు మంచి చేయాలని చూస్తామే తప్ప, హాని చేయాలని చూడమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సనప గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా చెబితే మాట నిలబెట్టుకోవడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఒకమాట.. గెలిచిన తర్వాత మరొకటి అనేది ఎప్పటికీ లేదన్నారు. భగవంతుడు మాకు బలం ఇచ్చినంత వరకూ ప్రజాసేవ చేస్తూనే ఉంటామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగేళ్లలో 90 శాతానికి పైగా హామీలను నెరవేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌ఫర్సన్ బోయ గిరిజమ్మ, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీ, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో లబ్ధిదారురాలికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కుందుర్పి : జగనన్న సురక్ష ద్వారా గ్రామాలతోపాటు పేదల అభివృద్ధి సాధ్యమని ఎంపిపి కమలమ్మ నాగరాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బెస్తరపల్లి, జంబుగుంపల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు జగనన్న సురక్షను ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గంగాధర, మమత, ధనుంజయ, జడ్పిటిసి రాధాస్వామి, జేఏసీ మండల కన్వీనర్ రాము, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ పాలక్షి, ఎంపిటిసి కవిత ఓబులేసు, రవి, బి.టి.రాము, ఎంపిడిఒ వెంకటనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంవీరుడు 'అల్లూరి'కి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని మంగళవారం జెఎన్‌టియులోని పరిపాలన భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి రంగజనార్ధన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిన్నప్పటి నుంచే దైవభక్తి, నాయకత్వ లక్షణాలు, దానగుణం వంటి లక్షణాలు ఉండేవన్నారు. ఇందులో భాగంగానే మన్యంవాసుల కష్టాలను తీర్చడానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాటం తెలుగువారికి గొప్ప స్ఫూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ పి.సుజాత, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, పి.ఆర్.భానుమూర్తి, ఇ.కేశవరెడ్డి, పద్మసువర్ణ, ఆర్.కిరణ్మయి, బి.ఈశ్వర్‌రెడ్డి, జి.వి.సుబ్బారెడ్డి, బి.దుర్గాప్రసాద్, ఎం.రామశేఖర్‌రెడ్డి, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య వర్ధంతులను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల భవనంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు కె.అబుబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్గాంబ, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయి బాబు, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు లక్ష్మి నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, నాగేశం, నారాయణ శెట్టి గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పట్టణంలోని ప్రత్యేక సబ్ జైలులో జైలు సూపరింటెండెంట్ వడ్డే మహేశ్వరుడు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

అనంతపురం : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పరితపించిన వంగవీటి మోహన్‌రంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు అన్నారు. మంగళవారం రంగా జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్‌కుమార్, సిద్ధు, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, శేషాద్రి, వెంకటరమణ, పవన్, నాయకులు చిరు, కాకర్ల శీనా, హిద్దు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

గర్భిణులు, బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌమార బాల, బాలికల్లో రక్తహీనత, పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల నెలసరి రక్తస్రావం, నులిపురుగులు పడే అవకాశం ఉందన్నారు. కావున ఐరన్ కల్గిన ఆహార పదార్థాలతో పాటు ప్రతి వారం పాఠశాలల్లో ఇచ్చే ఐరన్ ఫోలిక్ మాత్రలు, అంగన్వాడీల్లో ఇచ్చే బలామృతం, చిక్కీలు, డీ వార్మింగ్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆశాలు రోజువారి గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సేవలను ఈ ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, పిహెచ్ ఎన్.తులసమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల విధులు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, కౌమార దశ పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో కలిగే రక్తహీనతకు కారణాలు, నివారణ మార్గాలను సూచించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి లక్షణాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లక్ష్మీకుమారి, నాగరత్న, ఆరోగ్య పర్యవేక్షకురాలు షర్మస్‌వలి, సిహెచ్‌ఒలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి పావని చిన్నపిల్లలు, కిశోర బాలికలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతకు కారణాలు, నివారణ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న వైద్యాధికారులు

కుందుర్పి : విషజ్వరాల పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అనుషాదేవి సూచించారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో వైద్యసిబ్బంది మనవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్తాఫీసర్ ముంతాజ్ బేగం, రంగస్వామి, ప్రకాష్, నరసింహారావు, కళ్యాణదుర్గం తాలూకా మలేరియా అధికారి తిరుపాలయ్య పాల్గొన్నారు.

నార్పల : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక వైద్యశాల వైద్యులు ప్రవీణ్‌కుమార్ సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంతోపాటు పప్పూరులో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా నీటి నిల్వ ఉన్న చోట దోమలు పెరగకుండా వేస్ట్ ఆయిల్ చల్లాలన్నారు. అలాగే ఇళ్ల ఆవరణల్లో దోమల వృద్ధి చెందకుండా డ్రై డే ఫ్రైడే పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాదియా, జిల్లా మలేరియా అధికారి ఓబులు, మలేరియా అసిస్టెంట్ అధికారి సత్యనారాయణ, సభ్యులు మద్దయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్‌మూర్తి, ప్రమీలమ్మ, అక్కులప్ప, పప్పూరు వైద్యులు రవిశంకర్, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్‌ఒ సుబ్రమ్మణ్యం, వైద్యశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయానికి రూ.4.20 లక్షల ఆదాయం

గుత్తి :మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన శ్రీ బొలికొండ రంగనాథ స్వామి దేవస్థానానికి రూ 4.20 లక్షలు ఆదాయం లభించింది. ఆలయం వద్ద 7 నెలలపాటు టెంకాయల విక్రయ హక్కు కోసం మంగళవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రాణి, ఆలయ కార్య నిర్వహణాధికారి వి.దేవదాసు సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. తొండపాడు గ్రామానికి చెందిన చిదంబరి భార్య ఉమాదేవి రూ.4.20 లక్షలకు వేలం పాట పాడి హక్కును దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, సింగిల్‌విండో ఛైర్మన్ పురుషోత్తం యాదవ్, ఆలయ అర్చకుడు పార్థసారధిశర్మ, కమిటీ సభ్యుడు డేగ బాల రంగయ్య, ఎస్.ప్రమీలా, సిబ్బంది రామకష్ణ, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

24న చౌక దుకాణాల డీలర్ల సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

విజయవాడలో ఈనెల 24న జరగనున్న చౌక దుకాణపు డీలర్ల రాష్ట్ర సమావేశానికి డీలర్లు అందరూ తరలిరావాలని చౌక దుకాణపు డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమావేశంలో డీలర్ల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, నరసింహులు, రాజమ్మ, డీలర్లు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థికి బహుమతి

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన సుస్వాగత్‌కు ల్యాప్‌టాప్ బహుమతిగా అందజేశారు. గత మూడు సంవత్సరాల క్రితం యాడికి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో పనిచేస్తూ మరణించిన బాబు జ్ఞాపకార్థం అతని స్నేహితులు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.